క్లుప్తంగా

బకాయిలు విడుదల చేయాలని వినతి



శాయంపేట: మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో నిల్వ ఉన్న వస్త్రాలను వెంటనే కొనుగోలు చేసి, టెస్కో కొనుగోలు చేసిన కార్మికుల వస్త్రాల బకాయిలను చెల్లించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో శనివారం రాష్ట్ర వ్యవసాయ, చేనేత జౌళి, సహకార మార్కెటింగ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మర్యాదపూర్వకంగా కలిసి చేనేత సొసైటీలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. సమస్యలపై మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యలను పరిష్కరించేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్ఆర్ అధినేత నాయినేని సంపత్ రావు, నాయకులు గండ్ర సత్యనారాయణరెడ్డి, కిషన్‌రావు ఉన్నారు.

ప్రార్థనలు చేసిన కడియం



ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురం క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రవక్త డాక్టర్ పాల్సన్‌రాజ్‌తో ఆశీర్వదం తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ఆసియా ఖండలో అతిపెద్ద చర్చి కరుణాపురంలో నిర్మించడం చాలా సంతోషంగా ఉందని, ఎంతో మంది విశ్వాసులు ఆ చర్చికి రావడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. మందిర నిర్మాణానికి సహకరించిన డాక్టర్ పాల్సన్ రాజ్, డాక్టర్ జయప్రకాశ్ గోపును అభినందించారు. అనంతరం ప్రకాశయ్య ఇచ్చిన వినతిపత్రానికి స్పందిస్తూ మందిరంలో మిషన్ భగీరథ మంచినీటి నల్లా కనెక్షన్, డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంగాల ఇర్మియా, సునీల్, రవిపాల్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు అర్హత సాధించిన జగదీశ్



శాయంపేట : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ - 2023 స్కాలర్‌షిప్‌కు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి దాసరి జగదీశ్ అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వనం వెంకటేశ్వరరావు తెలిపారు. జగదీశ్ 8వ తరగతిలో రాసిన జాతీయస్థాయి ఎన్ఎంఎం 2023 స్కాలర్‌షిప్ పరీక్షలో మండలం నుంచి అర్హత సాధించడం సంతోషకరమన్నారు. అనంతరం జగదీశ్‌ను ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

అంబర్, గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

ఆరుగురిపై కేసు నమోదు



పరకాల : ప్రభుత్వ నిషేధిత అంబార్, గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్నారనే సమాచారంతో పట్టణంలోని పలు కిరాణ దుకాణాలపై సీఐ డి.రవిరాజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.29వేల 200 విలువ చేసే అంబార్, గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న రేపాల చంద్రశేఖర్‌గుప్తా, సూర రవీందర్, జులారి శ్రీకాంత్, పూరెళ్ల సత్యం, మోటం భద్రయ్య, బోయిని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై రమేశ్‌తో పాటు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ 'డాన్ టు డస్క్'

కాజీపేట: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ అనే కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాజీపేట పట్టణంలో ట్రాఫిక్ పోలీసులకు లైఫ్ జాకెట్లు, విద్యార్థులకు నోటు పుస్తకాలు, వీధి వ్యాపారులకు గొడుగులను క్లబ్ అధ్యక్షుడు వెనిశెట్టి రఘు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగబాబు, ఎస్సై సూర్యనారాయణ, క్లబ్ గవర్నర్ గంపా సాంబమూర్తి, మాదంశెట్టి పాల్గొన్నారు.

తవ్వారు.. పూడ్చడం మరిచారు

- రహదారి పక్కన ప్రమాదకరంగా గుంతలు
- అప్రమత్తంగా లేకపోతే అంతే..
- పట్టించుకోని అధికారులు

నడికూడ : మానవ తప్పిదాల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే అన్నిసార్లు వారి తప్పిదాలే ప్రమాదాలకు కారణం అని చెప్పలేం. కొన్నిసార్లు నిర్లక్ష్యం, పట్టించుకోని దురుసుతనం కూడా ప్రమాదాలకు దారితీస్తుంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రధానరోడ్డు వెంట కేబుల్ కోసం గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేయడంతో తరుచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ గుంతలను రోడ్డుకు సమాంతరంగా తవ్వడంతో ఇటీవల కురిసిన వర్షానికి పచ్చిక మొలసి వాహనదారులకు గుంత కనిపించడం లేదు. ద్విచక్ర వాహనదారులు రాత్రివేళ గుర్తించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గుంతలు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన పాలకులు, అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా స్పందించి గుంతలు తవ్విన వారిపై చర్యలు తీసుకుని వాటిని పూడ్చాలని కోరుతున్నారు. లేని పక్షంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశముందని స్థానికులు అంటున్నారు.



తవ్వివదిలేసిన గుంత



ప్రమాదకరంగా గుంత

పట్టించుకోవడం లేదు



తవ్వి వదిలేసిన గుంతల కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతలు ద్విచక్ర వాహనదారులకు మృత్యు శకటాలుగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వదిలేయడం విడ్డూరంగా ఉంది. రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తే సరిపోదు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి నివారణకు చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయించాలి.

-మొర్రి సందీప్, నడికూడ

ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై దురుసు ప్రవర్తన

- మహిళపై కేసు నమోదు



ఎక్సైజ్ కానిస్టేబుల్ చొక్కా పట్టుకున్న మహిళ

శాయంపేట : ఎక్సైజ్ కానిస్టేబుల్ చొక్కా పట్టుకొని దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన మహిళపై కేసు నమోదు అయ్యింది. ఈ సంఘటన మండలంలోని సూర్యానాయక్‌తండలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూర్యానాయక్‌తండ గ్రామంలోని జర్పుల జ్యోతి ఇంటి వద్ద నాటుసారా తయారీ జరుగుతుందని పక్కా సమాచారం మేరకు శనివారం పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ, జిల్లా ఎక్సైజ్, టాస్క్ ఫోర్స్ పోలీస్‌లు దాడులు చేశారు. పోలీస్‌లను చూసి గుడుంబా తయారీ చేస్తున్న వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. సిబ్బంది సహాయంతో అతన్ని పట్టుకుని విచారించగా నాటుసారా తయారీకి షుగర్ పానకం ఉందని చెప్పాడు. దీంతో ఆ వ్యక్తిని పోలీస్‌లు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా జర్పుల జ్యోతి అక్కడికి చేరుకొని ఎక్సైజ్ పోలీస్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ వరుణ్‌రెడ్డి యూనిఫాం చొక్కా పట్టుకున్నట్లు తెలిపారు. దీంతో ఎక్సైజ్ సీఐ తాతాజీ ఫిర్యాదు మేరకు జర్పుల జ్యోతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

'ఆరు గ్యారంటీల్లో' అధికారుల నిర్లక్ష్యం

నడికూడ : అధికారుల నిర్లక్ష్యంతో అభయాహస్తం ఆరు గ్యారంటీలను కోల్పోతున్నామని మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్‌లో అభయహస్తం గ్యారంటీల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేశామని, ఇచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో ఏమైనా పొరపాట్లు ఉంటే దరఖాస్తు చేసిన లబ్ధిదారుల నుంచి ఫోన్ ద్వారా పూర్తి సమాచారం సేకరించి వారికి అభయాహస్తం గ్యారంటీలు అందేలా చూడాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని ఆరోపించారు. కొన్నిరోజుల నుంచి ఎలక్షన్ కోడ్ వలన సైట్ ఓపన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారని వాపోయారు. దరఖాస్తులో జరిగిన తప్పొప్పులను సరిచేసేందుకు అవకాశం కల్పించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి అధికారులు రాలేదని తెలిపారు.



ఉదయం 11 గంటలైన రాని కార్యాలయ సిబ్బంది

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే అంగవైకల్యం అడ్డుకాదు

ఐనవోలు : చదువుకునేందుకు అంగవైకల్యం అడ్డు కాదని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే గెలుపు తలుపు తడుతుందని విద్యావారధి జిల్లా అధ్యక్షుడు బీమళ్ల సాయ్యు, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్‌పీ) దూసరి భవన్ కుమార్ అన్నారు. శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ ఆవాస ప్రాంత సర్వే నిర్వహించారు. సింగారం, ఐనవోలు గ్రామాల్లో ఫిజికల్లీ డిసేబుల్ విద్యార్థులను గుర్తించి సమీప ఒంటిమామిడిపల్లి, ఐనవోలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అంగవైకల్యం కలిగిఉన్న విద్యార్థులకు బోధించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందని చెప్పారు. ప్రత్యేక అవసరాల కోసం పిల్లలను ఇంట్లో ఉంచకుండా పాఠశాలకు పంపి వారి భవిష్యత్‌కు తొడ్పాడాలని కోరారు. అంగవైకల్యం ఉందని బాధపడొద్దని ఈ సందర్భంగా సూచించారు.



బాడిబాటలో సారయ్య, భవన్‌కుమార్

ఎర్రబంగారంపై అధిక దోపిడీ

నడికూడ : విత్తనాల విక్రయంలో కృతిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా వ్యాపరస్తులు పెడచెవిన పెడుతున్నారు. ఎమ్మార్పీ కంటే అధిక రేట్లతో విక్రయిస్తూ రైతుల జేబుకు చిల్లు పెడుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపు యజమానులు మిర్చి సీడును అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం. ఎమ్మార్పీ రూ. 730, 750 ఉంటే రైతులకు మాయమాటలు చెప్పి రూ. 1100 నుంచి రూ. 1150కి విక్రయిస్తున్నట్లు తెలిసింది. వ్యవసాయశాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మార్పీకే మేలు రకమైన విత్తనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొలకెత్తని మొక్కజొన్న.. ఆందోళనలో రైతు

ఐనవోలు : ప్రైవేటు కంపెనీకి చెందిన మక్కజొన్న విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో నష్టపోయానని మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియో శనివారం వైరల్ అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన బండారి శ్రీను వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఎకరంన్నర భూమి కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో పదిరోజుల క్రితం ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన 3 బస్తాల మొక్కజొన్న విత్తనాలు ఖరీదు చేసి చెలుకలో విత్తుకున్నాడు. పదిరోజులు గడిచినా విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో సంబంధిత డీలర్‌ను సంప్రదించాడు. అతను పట్టించుకోలేదని, 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాని, ఎన్నడూ విత్తనం మొలకెత్తకుండా లేదని వాపోయారు. భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తే రూ.20 వేల నష్టం వాటిల్లిందని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు.



మిర్చి చేనును చూపుతున్న రైతు

ఎడ్లబండిని ఢీ కొట్టిన బొలెరో

- ఎద్దు మృతి, రైతుకు గాయాలు

ఐనవోలు : అదుపుతప్పిన బొలెరో వాహనం ఎడ్లబండిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎద్దు మృతి చెందగా రైతుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొండపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండపర్తి గ్రామానికి చెందిన కౌలు రైతు బొక్కల సురేష్ వ్యవసాయ బావి వద్ద పనులు ముగించుకుని ఎడ్లబండిపై గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో కొండపర్తి నుంచి భట్టుపల్లికి వస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో రూ. 50 వేల విలువగల ఎద్దు మృతిచెందగా రైతు సురేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎడ్ల బండి ముక్కలు ముక్కలుగా విరిగిపోగా బొలెరో వాహనం బోల్తా పడింది. స్థానికులు 108 వాహనంలో రైతు, బొలెరో వాహనంలో ప్రమాణిస్తున్న ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా సాక్షిలో ఇటీవల 'వామ్మో కొండపర్తి దారి' అనే కథనం ప్రచురితమైనా అధికారులు, పాలకుల్లో చలనం రాలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.



బోల్తా పడిన బొలెరో, విరిగిపోయిన ఎడ్లబండి





గాయపడిన సరేష్, మృతిచెందిన ఎద్దు

ఆర్థికసాయం అందజేత



దామెర : మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన డీజే నిర్వహకుడు గజ్జి రాజ్‌కుమార్ ఇటీవల మృతిచెందాడు. కాగా శనివారం వారి కుటుంబ సభ్యులను మండలంలోని శ్రీరామ్ డీజే యూనియన్ నాయకులు పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.10,000 ఆర్థిసాయం అందించారు. యూనియన్ అధ్యక్షుడు పెంట రాజు, నాయకులు మాదారపు కిషన్, కోల నరేశ్, రాకేశ్, శ్రీకాంత్, అనిల్, లింగమూర్తి, అంజద్, భిక్షపతి, శాంతిరాజ్, నగేష్, రవి పాల్గొన్నారు.

దేవాలయ భూములను పరిరక్షించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి : అన్యక్రాంతమవుతున్న కొత్తకొండ దేవాలయ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం, అదికారులపై ఉందని వెంటనే హద్దులు నిర్ణయించి సంరక్షించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం దేవాలయానికి సంబంధించిన భూములను పరిశీలించారు. ఆలయ భూములు కబ్జాకు గురవుతుంటే ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కబ్జాకు గురైన భూములపై సమగ్ర సర్వే జరిపించి హద్దులు నిర్ణయించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ రాలేదన్నారు. టీడీపీ, జేడీయూ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గతంలో కంటే గణనీయమైన సీట్లు గెలుచుకొని ప్రధాన ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావల్సిన విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారధి, ఆదారి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్రె లక్ష్మణ్, పుట్టపాక రవి, ఆదరి రమేశ్, రావుల తిరుపతి, బాలరాజు, కుమారస్వామి, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆలయ భూములను పరిశీలిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

ఐనవోలులో..

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తుల నిర్ధాయక కమిషన్ ఏర్పాటు చేసి అన్ని పంటలకు మద్దతు ధరలను నిర్ణయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. శనివారం మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామంలో సీపీఎం మండల కమిటీ సమావేశం బండి పర్వతాలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ధరణిలో జరిగిన లోపాలను సమగ్ర భూ సర్వే జరిపి గ్రామసభల్లో సవరించాలన్నారు.

పేదింటి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి వరం

పరకాల : రాష్ట్రంలోని పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరంగా మారుతోందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో మండలంలోని 33 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.33లక్షల 3వేల 868 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది నిరుపేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.వీ భాస్కర్, కౌన్సిలర్స్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రేవూరి

అధ్యక్షుడిగా సదానందం



కమలాపూర్ : మండల కేంద్రంలోని పనగట్ల వాడ ముదిరాజ్ సేవాసంఘం అధ్యక్షుడిగా బొజ్జం సదానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పనగట్లవాడ ముదిరాజ్ కులస్తులు శనివారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కొంతం సదానందం, బుర్రి కుమారస్వామి, ప్రధానకార్యదర్శిగా పిట్టల ధర్మయ్య, సహాయ కార్యదర్శిగా కొంతం లక్ష్మణ్, కోశాధికారిగా కొంతం రవి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సొప్పరి సాంబయ్య, బొజ్జం సంపత్, సంగినేని నరేష్, బుర్రి దర్గయ్య, మేకల కుమారస్వామి, గౌరవ అధ్యక్షులుగా సుతారి రవి, పిట్టల కృష్ణ, గౌరవ పెద్దమనుషులుగా పిట్టల సమ్మయ్య, బుర్రి సదానందం, కొంతం సంపత్, పడాల్‌దాసులుగా పిట్టల నరేష్, మహేష్ నియమితులయ్యారు.

తాటిచెట్లు తొలగించినవారిపై చర్య తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న గౌడసంఘం నాయకులు

ఆత్మకూరు : మండల కేంద్రంలో కల్లు పారుతున్న తాటిచెట్లను జేసీబీతో తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గీతకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తాటిచెట్లను తొలగించిన భూస్వామి లక్ష్మారెడ్డి, కౌలుదారు తోట సదయ్యపై కఠిన చర్య తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో సీఐ క్రాంతికుమార్‌తో పాటు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 30 తాటిచెట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు పట్టిచుకోవాలని కోరారు. గౌడసొసైటీల ద్వారా 5ఎకరాల స్థలంలో తాటి, ఈత, గిరిక తాళ్లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జనగాం భిక్షపతిగౌడ్, గౌడసంఘం అధ్యక్షుడు విలాసాగరపు స్వామి, కార్యదర్శి ఏరుకొండ పైడి, గుర్రం ప్రభాకర్, బయగాని రమేశ్, ఏరుకొండ భగవాన్, గుర్రం రంజిత్‌గౌడ్, పొగాకుల సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి స్పాట్ అడ్మిషన్లు

కమలాపూర్ : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత తెలిపారు. ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలకు నేరుగా హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రెడ్డి సంఘం కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామ రెడ్డి సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిట్టిరెడ్డి జలేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వెంకటరాజురెడ్డి, హంసరెడ్డి, సాంబరెడ్డి, విజయ్‌రెడ్డి, రాజిరెడ్డి, నరేష్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా రాజిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, జంగారెడ్డి, సమ్మిరెడ్డి, జయ్‌పాల్ రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ నాయకుడు విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ఆదరణ చూస్తుంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పగడాల కాళీప్రసాద్‌రావు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో మూడోవసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపడితే ప్రపంచమంతా హర్షిస్తుంటే ప్రతిపక్షం మాత్రం జీర్ణించుకోలేకపోతుందన్నారు. దేశాభివృద్ధి నరేంద్ర మోదీ, బీజేపీతోనే సాధ్యమని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా ఏమిటో చూపించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు సముచిన స్థానం ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరితో కలిసికట్టుగా ఉంటూ నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. రాష్ట్ర నాయకులు గురుప్రసాద్, మేఘనాథ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ భద్రయ్య, నాయకులు విజేందర్‌రావు, రాజేందర్‌రెడ్డి, నిరంజన్, రాజభద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆలయంలో మాససంక్రమణ పూజలు



పెద్దపట్నం వేసి పూజలు చేస్తున్న ఒగ్గు పూజారులు

ఐనవోలు : ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో మాససంక్రమణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం నిత్యపూజల అనంతరం స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం జరిపించారు. గొల్లకేతమ్మ, బలిజమేడలమ్మతో మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేసి ఒగ్గు పూజలు చేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, అర్చక సిబ్బందితో పాటు స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం

ఎల్కతుర్తి : వర్షాలు సకాలంలో కురవాలని కోరుతూ మండలంలోని కోతులనడుమ గ్రామంలో శనివారం మహిళలు పెద్దఎత్తున గ్రామ దేవతలైన (బొడ్రాయి) భూలక్ష్మి, మహాలక్ష్మి, పోచమ్మ విగ్రహాలకు జాలాభిషేకం చేశారు. వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురువాలని అమ్మవార్లను వేడుకున్నారు. అనంతరం చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు.



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు